ఆ స్టేషనా... బాబోయ్ మా కొద్దు !

- అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను వేధిస్తున్న సిబ్బంది కొరత
- 60 మందికి గాను 40 మందే విధులు
- ఇద్దరు ఎస్‌ఐలతో సహా 20 మంది సిబ్బంది అవసరం
- స్టేషన్ పేరు చెబితేనే మేము వెళ్లమంటున్న పోలీసులు



సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నగరంలో అత్యంత కీలకమైన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికే పనిచేస్తున్న సిబ్బందిపై తీవ్ర పని ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. మరోవైపు స్టేషన్ పరిధిలో నేరాలు.. చోరీలు.. పాతనేరస్తుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30, 32, 34 (కొంతభాగం), 57, 58, 59 డివిజన్లు ఉన్నాయి. వీటిల్లో సుమారు లక్ష మందికి పైగా జనాభా ఉన్నారు. 200 మందికి పైగా రౌడీషీటర్లు, సస్పెక్ట్, కేడీలు, పాతనేరస్తుల చిట్టా ఉంది. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ అంటేనే తరచూ ఏదో ఒక మూలన గొడవలు, దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఆత్మహత్యలు చోటుచేసుకుంటాయనే పేరు కూడా ఉండడంతో పోలీసులు ఈ స్టేషన్ పేరు చెబితేనే భయపడే పరిస్థితి నెలకొంది.

నేరస్తులపై తప్పుతున్న పట్టు....

గతంలో మాదిరిగా ప్రస్తుతం నేరాల నియంత్రణపై.. నేరస్తుల ఆగడాలను అదుపుచేయడంపై పోలీసుల పట్టు పూర్తిగా తప్పుతుంది. స్టేషన్ పరిధిలో ఉన్న నేరస్తులను కంట్రోల్ చేయడానికి కానీ.. నేరాలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలన్నా కానీ ఇక్కడ 60 నుంచి 80 మందికిపైగా సిబ్బంది అవసరం ఉంది. అయితే కేవలం 40 మంది మాత్రమే ఇక్కడ విధుల్లో ఉండడం వల్ల వారిపై తీవ్ర పని ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. దీంతో నేరస్తులపై నిఘా లోపించడం వల్ల స్టేషన్ పరిధిలో మళ్లీ పాత నేరస్తులంతా గ్రూపులుగా మారి అల్లర్లు, నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దొంగతనాలు, హత్యలు, దోపిడీ ఘటనలే వీటికి ఉదాహరణగా కనిపిస్తున్నాయి.

ఎస్‌ఐలు సైతం బెదిరిపోతున్నారు..

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ అంటేనే పోలీసులు బెదిరిపోతున్నారు. ఈ స్టేషన్‌లో పనిచేసేందుకు కానిస్టేబుళ్లతో పాటు ఎస్‌ఐలు సైతం ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం స్టేషన్ పరిధిలో ఇద్దరు ఎస్‌ఐల కొరత ఉండగా వాటి కోసం ఒక ఉమెన్ ఎస్‌ఐ, మరో మెన్ ఎస్‌ఐని బదిలీ చేసేందుకు కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వస్తున్నట్లుగా తెలిసింది. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ ఇద్దరు ఎస్‌ఐలు ఈ స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు విముఖత చూపుతున్నట్లు సమాచారం. వాద్దరు ఈ స్టేషన్ కాకుండా వేరే పోలీస్‌స్టేషన్‌కు తమను బదిలీ చేయాలంటూ ఉన్నతాధికారులను వేడుకొంటున్నట్లు వినికిడి. ఎస్‌ఐలకే అంత భయం ఉంటే మా పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాలా అన్నట్లుగా కానిస్టేబుల్స్ కూడా ఇదే పంథాలో ఉన్నతాధికారులకు అర్జీలు సమర్పిస్తున్నట్లు తెలుస్తుంది.

సంచలనంగా ఘటనలు...

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే ఘటనలన్నీ సంచలనంగా మారతాయి. ఐదేళ్ల క్రితం వరకు సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ అంటేనే సీఐలతో సహా వణికిపోయేవారు. ఇక్కడ విధుల్లోకి వచ్చిన సీఐలు అంతా వరుసగా సస్పెండ్‌లకు గురయ్యే విధంగా ఈ స్టేషన్ పరిధిలో సంఘటనలు చోటుచేసుకున్నాయి అంటేనే ఈ స్టేషన్ ఎంత ప్రమాదకరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన లక్ష్మీనారాయణ ఒక్కరే ఎక్కువ కాలం పనిచేసి, సస్పెండ్ కాకుండా వెళ్లిన సీఐగా రికార్డు సృష్టించారు. ఆయన తనదైన శైలిలో నేరస్తులను, నేరాలను అదుపులో పెట్టి వెళ్లగా ఆ తరువాత వచ్చిన సీఐ గురుప్రకాష్ కూడా మంచిగానే ఏడాదికి పైగా విధులు నిర్వహించి ఇక్కడి నుంచి వన్‌టౌన్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన తరువాత వచ్చిన సీఐ శివాజీ నెలరోజుల వ్యవధిలోనే బదిలీపై వెళ్లిపోగా డీహెచ్ వెంకటేశ్వర్లు సీఐగా బాధ్యతలు చేపట్టి రెండు నెలలు పూర్తయింది. ప్రస్తుతం స్టేషన్ పరిధిలో పరిస్థితిలు చేజారే ప్రమాదం కనిపిస్తుందని, ఏదైనా ఘటనలు చోటుచేసుకోకముందే పోలీసు ఉన్నతాధికారులు ఈ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని స్థానిక పెద్దలు, నాయకులు, ప్రజలు కోరుతున్నారు. స్టేషన్‌లో సిబ్బంది కొరతను తగ్గించి అవసరానికి తగ్గటుగా అధికారులను, సిబ్బందిని కేటాయించాలని.. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



స్టేషన్ పరిధిలో పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాము. రోడ్లపై అల్లర్లు, గొడవలు జరగకుండా.. ఎటువంటి సంఘ విద్రోహ శక్తులు ప్రబలకుంటా ప్రతిరోజూ సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బీట్లు వేస్తున్నాము. నేరాలకు పాల్పడాలని చూసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు.

– డీహెచ్ వెంకటేశ్వర్లు, సీఐ

క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో 300 మందికి అన్నదానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో సోమవారం ఏకాదశిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. వంగవీటి రాధా స్వయంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శౌరి మృతి తీరనిలోటు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చింతకుంట శౌరీ (70) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మరణవార్తను తెలుసుకున్న పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు సింగ్‌నగర్‌లోని శౌరీ ఇంటికి చేరుకొని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం శౌరీ ఎంతో శ్రమించారని కొనియాడారు. ఆయన లేని లోటు పార్టీకి తీర్చలేనిదన్నారు. శౌరి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ



పాయకాపురం(విజయవాడరూరల్):ప్రస్తుత జీవన విధానంలో ఆయుర్వేద ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంటు డైరెక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూ రాజీవ్‌నగర్, పాయకాపురంలోని సంస్థలో 9వ ఆయుర్వేద దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద ఆహారపు అలవాట్లు రోగాల బారిన పడకుండా మనిషి ఆయుష్‌ను పెంపొందిస్తాయని చెప్పారు. ఆయుర్వేద ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ సంస్థ నుంచి బయలుదేరి ప్రకాష్‌నగర్ మీదుగా నున్న పోలీసు స్టేషన్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయి ప్రసాద్, ఏఎస్‌ఐ జె.కృష్ణ, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్రంలో విద్యార్థులు రాణించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు భౌతికశాస్త్రంలో మరింతగా రాణించే దిశగా తీర్చిదిద్దాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ తెలిపారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న పదో తరగతి వారికి భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నగరంలో జరుగుతుంది. అందులో భాగంగా మైనం హుస్సేన్ మాట్లాడుతూ నూతన పాఠ్య పుస్తకం, రాబోయే ఎస్ఎస్‌సీ పరీక్షల ప్రశ్నాపత్రం తదితర అంశాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను ఎలా నివృత్తి చేయాలనే అంశాలపై వివరిస్తామని చెప్పారు. అలాగే విద్యార్థులకు మంచి మార్కులు రావటంతో పాటుగా నూరు శాతం ఫలితాలను సాధించేందుకు కృషి జరగాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, అధికారులు రావి అరుణ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

30 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్:మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న 30 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ సోమవారం జరిమానా విధించారు. మూడో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అమ్మవారి వైభవంపై ప్రవచనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై సోమవారం అమ్మవారి వైభవంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై బాపట్ల సమీపంలోని అద్దంకికి చెందిన కె.రమాసుందరి అమ్మవారి నామ విశిష్టత, అమ్మవారి అభరణాల విశిష్టతతో పాటు నామ విశిష్టత గురించి చక్కటి వ్యాఖ్యానంతో వివరించారు. అనంతరం ప్రవచనకర్తకు అమ్మవారి దర్శనం కల్పించి అధికారులు ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా తమ్మిన దుర్గా రావు నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మంగళ వారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ రాజరాజేశ్వరి పేట వెల్లే రోడ్డు, జీవీఎస్ యాప్ రోడ్డు, కళ్యాణ్ గౌరీ ఆపోజిట్ రోడ్డు, చలసాని అపార్ట్‌మెంట్స్ రోడ్డు, జిమ్ రోడ్డు, మంజునాథ అపార్ట్‌మెంట్స్ రోడ్డు, సన్ సిటీ కాలనీ, జయమ్మ ఐ హాస్పిటల్ రోడ్డు, స్మైల్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు, నూజివీడు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి


నగరవాసుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి

పటమట(విజయవాడతూర్పు):ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. వీఎంసీ కమిషనర్ ఆదేశాలతో సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 ఫిర్యాదులను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగంపై -6, ప్రజారోగ్యం-2, ఇంజినీరింగ్-1. రెవిన్యూ విభాగం-1 ఫిర్యాదులను స్వీకరించారు. డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ పి.సత్యనారాయణ, పి. సత్య కుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధికి శిక్షణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు


పాయకాపురం(విజయవాడరూరల్):నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థలు, బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణ తరగతులను రాజీవ్‌నగర్లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని యువతకు ఏసీలు, వాషింగ్ మిషన్ల రిపేర్ చేయడంలో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. 42 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఏసీలు, వాషింగ్ మిషన్ల రిపేర్లు, సర్వీసు చేసేందుకు 45 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్థికంగా ఊహించనంత నష్టం జరిగిందని, అందువల్ల కొంతమంది యువతకైనా శిక్షణ ఇస్తే స్వయం ఉపాధిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతి, శిక్షణకు కావాల్సిన సామగ్రిని కూడా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియచేశారు. శిక్షణ పూర్తయిన తర్వాత అర్హులైన వారందరికీ ఎల్జీ కస్టమర్ సర్వీసులోకి తీసుకొంటామనా ఎల్జీ కంపెనీ ప్రతినిధి రఘునాథన్ ఉమేంద్ర తెలిపారు. పుట్టపర్తి సత్యసాయి సంస్థ ప్రతినిధులు, ఎల్జీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిమ్స్, ఎన్ఆర్ఐకు సిటీ సర్వీసు ప్రారంభం


ఎయిమ్స్, ఎన్ఆర్ఐ సిటీ సర్వీసుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు సోమవారం దావు బుచ్చయ్యకాలనీ నుంచి మధురానగర్, గులాబీతోట మీదుగా మంగళగిరి ఎయిమ్స్, ఎన్ఆర్ఐకు సిటీ బస్సు ప్రారంభమయింది. పేద మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఇక్కడ నుంచి స్థానికులు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి. వసంత కుమార్ మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సులు వేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు దావు బుచ్చయ్యకాలనీ నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సును వేశారు. అయితే మధురానగర్‌లో ఆర్‌యూబీ పనులు ప్రారంభంకావటం, మెయిన్ రోడ్డు మూసివేయటం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్డు పనుల వల్ల సిటీ సర్వీసును అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో మరోమారు స్థానికులు డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు స్పందన, ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. దీంతో ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి మూడు సిటీ సర్వీసులను మంజూరు చేశారు. సోమవారం మొదటి సర్వీసును స్థానికులతో కలిసి మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ఆర్టీసీ సిటీ సర్వీసుకు స్వాగతం పలికారు. అలాగే సిటీ బస్సు ఆగే ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయటంతో పాటు సిటీ సర్వీసుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సిటీ బస్సు సర్వీసు ప్రారంభం పురస్కరించుకుని కొబ్బరికాయ కొట్టి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కె.రాము, జి.ఏడుకొండలు, పీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆర్యాపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, మరింత మెరుగైన ఫలితాలు సాధించటానికి తల్లిదండ్రులు సహకరించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆర్యాపతి కోరారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఏంచేస్తున్నారో ఎప్పటికప్పుడు గమనించాలని ప్రతిరోజూ కళాశాలకు పంపించాలని కోరారు. అలాగే విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు వివరించి పలు సూచనలు చేశారు. వరదల్లో పుస్తకాలు కోల్పోయిన వారికి మరోమారు పుస్తకాలు ఉచితంగా అందజేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్‌బీఐ వారు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బ్యాగులు అందించి అభినందించారు.

త్రిశక్తి పీఠంలో 2 నుంచి మహాలింగార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు):కార్తీక మాసం సందర్భంగా బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో నెల రోజుల పాటు మహాలింగార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు పుట్టమన్నుతో చేసిన లింగాలకు విశేష అర్చన, అభిషేకం చేస్తామని పేర్కొన్నారు. నెల రోజుల అభిషేకానికి రూ.1500 చెల్లించాలని, ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నానో టెక్నాలజీలో ఆవిష్కరణలు తీసుకురావాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ):రసాయనశాస్త్ర విద్యార్థులు నానో టెక్నాలజీ ద్వారా మరిన్ని ఆవిష్కరణలు తీసుకురావాలని మిట్ వరల్డ్ పీస్ యూనివర్సిటీ (పుణే) డిపార్ట్‌మెంట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ మూర్తి ఎస్ఎస్ఎస్ చావాలి యాదవ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నానో మెటీరియల్స్ అండ్ అప్లికేషన్స్' అంశంపై సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ మూర్తి ఎస్ఎస్ఎస్ చావాలి యాదవ్ మాట్లాడుతూ నానో టెక్నాలజీ వినియోగం రసాయనశాస్త్రంలో విస్తృతమైందన్నారు. నూతన అంశాల ఆవిష్కరణతో పాటుగా పలు సమీకరణాలకు నానో టెక్నాలజీని వినియోగిస్తున్నారని వివరించారు. నానో పదార్థాలను వైద్యం, విద్యుత్ పరికరాల తయారీలో, పర్యావరణ పరిరక్షణకు వినియోగిస్తున్నారన్నారు. వైద్యరంగంలో సూక్ష్మజీవుల సంహారకాలుగా, మందులను శరీరంలో ప్రవేశపెటేట కారకాలుగా వినియోగిస్తున్నారని వివరించారు. విద్యుత్ రంగంలో పాక్షిక విద్యుత్ వాహకాలుగా బయో సెన్సార్లను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు నానో టెక్నాలజీ చాలా కీలకమైనదిగా చెప్పారు. విద్యార్థులు ఈ రంగంలో ఉన్న నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేసి తద్వారా మరిన్ని నూతన అంశాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించి జరిగే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఒ. శైలజ, డాక్టర్ కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరం


వైద్య శిబిరంలో బీపీ చెకప్ చేయించుకుంటున్న సీపీ రాజశేఖరబాబు


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్:పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను వివిధ అంశాలపై రూపొందించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే పోలీసుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అను ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించామని తెలిపారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో రుమటాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ, కార్డియాలజీ, డయాగ్నోసిస్ పరీక్షలు, పీడియాట్రిక్స్, బీపీ, షుగర్, ఈసీజీ, డెంటల్, కంటి, 2డీ ఎకో వైద్య పరీక్షలను పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించామన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అను ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి వివరించారు. డీసీపీలు గౌతమి సాలి, తిరుమలేశ్వరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, ఉదయరాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుర్గాపురంలో గర్భిణులకు రక్తపరీక్షలు


గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న బృందం సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని పలు ప్రాంతాలను సోమవారం టాస్క్ ఫోర్స్ బృందం పర్యటించి గర్భిణులు, చిన్నారులను పరీక్షించారు. ఈ సందర్భంగా గర్భిణులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించటంతో పాటు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే స్కూలుకు వెళ్లని పదిమంది చిన్నారులను గుర్తించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ర్యాండమ్‌గా పరీక్షించి వైద్యసేవలు సక్రమంగా అందు తున్నాయో లేదో పరీక్షించారు. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, డీపీహెచ్ఎస్ఓ లిన్నెట్ లిడియా, హెల్త్ సూపర్‌వైజర్ వీకేఎస్‌వీ జయలక్ష్మి, డీపీఓ మహేష్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక కల్యాణ మండపానికి బుకింగ్స్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



బుకింగ్స్ ప్రారంభమయ్యాయంటూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. పనులు పూర్తయినా అందుబాటులోకి రాని దుర్గాపురం చిట్యాల ఐలమ్మ సామాజిక భవనంకు సోమవారం అధికారులు బుకింగ్స్ ప్రారంభించారు. ఇక్కడ అన్ని వసతులతో చిట్యాల ఐలమ్మ సామాజిక భవనం పేరిట రజక కళ్యాణ మండపంను నిర్మించి నప్పటికీ ప్రారంబానికి నోచుకోకపోవటంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి సోమవారం' రజకుల కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తెండి' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సోమవారం కళ్యాణ మండపంకు బుకింగ్స్ ప్రారంభించారు. కళ్యాణ మండపం వద్ద బుకింగ్స్ ప్రారంభం అయ్యాయని సంప్రదించాల్సిన నెంబరుతో బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రజక కళ్యాణ మండపంను వినియోగంలోకి తీసుకురావటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ ఫీజు వసూలు తగదు

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు


మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఆటో కార్మికుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు తగదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. గుడ్స్ ఆటో వర్క్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డు రథం సెంటర్‌లో సోమవారం వార్షికోత్సవం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోటేశ్వరరావు హాజరై జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాతబస్తీలోని వ్యాపార సముదాయాలు నుంచి ప్రజలు కొనుగోలు చేసిన సామగ్రిని తీకెళ్లాలంటే గూడ్స్ ఆటో సౌకర్యం ఉండాల్సిందేనన్నారు. కెనాల్ రోడ్డులోని పార్కింగ్ ఫీజులతో విచ్చలవిడిగా వారు తోచిన పద్ధతిలో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 50 నుంచి 100 రూపాయాల వరకు వసూలు చేస్తున్నారన్నారని చెప్పారు. ఈ వసూళ్లు కాంట్రాక్టర్ ద్వారా జరుగుతోందన్నారు. 20 సంవత్సరాలుగా ఆటో కార్మికులు జీవనం సాగిస్తున్నా వారిని కూడా పార్కింగ్ ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారని, అది సరైన విధానం కాదన్నారు.